# బాదరాయణ సంబంధం



***అస్మాకం బదరీ చక్రం***
***యుష్మాకం బదరీ తరుః***
***బాదరాయణ సంబంధం***
***యూయం యూయం వయం వయం***

***భావం:*** నా బండి చక్రం రేగు కలపతో చేశారు. మీ ఇంటి ముందు రేగు చెట్టున్నది. మన మధ్యది బాదరాయణ సంబంధం ( రేగు చెట్టు సంబంధమైన బంధం) మీరు, మీరే, మేము మేమే.

వైశాఖ మాసం చివరి రోజులు. రోహిణికార్తెలో రోళ్ళు బద్దలవుతాయంటారు. నడి వేసవిలో పది గంటలకే ఎండ మండిపోసాగింది. ఒకాయన బండి తోలుకుంటూ గ్రామంలో ప్రవేశించాడు. పల్లె మొదట్లోనే రేగు చెట్టుంది. చెట్టు కింద బండి ఆపి, ఎడ్లను విప్పి చెట్టుకు కట్టేశాడు. చెట్టుకి ఎదురుగా ఉన్న ఇంటి వీధి గుమ్మం తలుపుతీసే ఉంది. గుమ్మం దాటి నడవలోకి వెళ్లి 'అమ్మాయీ, కొంచెం దాహం తీసుకురామ్మా' అన్నాడు.

వంటింట్లో ఉన్న ఇల్లాలు 'ఎవరింత చనువుగా పిలుస్తున్నారు'. అనుకుంటూ మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. ఇంటి ఎదురుగా బండీ, ఎద్దులూ కన్పిస్తున్నాయి. గ్రామాంతరం నుంచి వచ్చినట్లుంది. ఎవరో గుర్తు తెలియడం లేదు. భర్త వైపు బంధువులయి ఉంటారనుకుంది. 'ఎప్పుడూ నా వైపు బంధువులనే ఆదరిస్తాననీ, అయన వైపు బంధువులకి మర్యాద చెయ్యననీ అంటూంటారు. ఈ వచ్చినాయనకి పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెడితే ఆయన ఇంక నన్నేమీ అనరు' అనుకుంది. 'కూచోండి బాబయ్యగారూ' అంటూ లోపలకు వెళ్లింది.

ఎడ్ల మేత పూర్తయ్యేక వెడదామనుకుని ఆయన కూచున్నాడు. ఇంటి యజమాని కొంతసేపటికి ఇంట్లోకి వచ్చాడు. నడవలో కూచున్న ఆయనను చూసి భార్య వైపు బంధువనుకుని 'బాగున్నారా' అని పలకరించి లోపలకు వెళ్లాడు. వంటింట్లో భార్య అనేక రకాల వంటలు చేస్తోంది. 'వచ్చింది దగ్గర బంధువే కాబోలు. అందుకే పెద్దఎత్తున వండుతోంది. తనవైపు బంధువులని నేను గౌరవించనంటుంది కదా. ఇప్పుడు నేను చేసే మర్యాదలు చూస్తే ఇంక నోరెత్తదు' అనుకున్నాడు. వచ్చినాయనను స్నానానికి పిలిచారు. సంపెంగ నూనెతో, పన్నీటితో అభ్యంగన స్నానం. స్నానం కాగానే యజమాని కొత్త బట్టలు తెచ్చి కట్టబెట్టాడు. ఆపైన పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం, పచ్చకర్పూరంతో తాంబూలం. 'ఇక వెళ్ళి వస్తానమ్మా, వస్తాను బాబూ' అంటూ ఆయన వెళ్ళి ఎడ్లను బండికి కట్టిబయల్దేరాడు.

'చూశారా మీ వాళ్లకి ఎంత మంచి భోజనం పెట్టానో' అంది భార్య. 'మా వాళ్లేమిటి? మీ వాళ్లనుకుని మర్యాద తగ్గకూడదనుకుని కొత్తబట్టలిచ్చాను' అన్నాడు భర్త. ఇద్దరూ ఒకరిని ఒకరు తిట్టుకున్నారు. ఆపైన బండి వెనక పరిగెత్తి 'అయ్యామీరెవరు? మాతో మీకున్న సంబంధమేమిటి' అని అడిగారు.

'మీ ఇంటి ముందు బదరీవృక్షముంది(రేగుచెట్టు).నా బండి చక్రం రేగు కలపతో చేశారు.మనది బాదరాయణ సంబంధం. అంతకన్నా ఏం లేదు' అంటూ బండి తోలుకెళ్ళిపోయాడు. భార్యభర్తల కళ్ళలో బండి వెళ్లడంవల్ల రేగిన దుమ్ము పడింది.

వారిద్దరి కళ్ళలో దుమ్ము పడిందా? వారే కళ్లల్లో దుమ్ము కొట్టుకున్నారా? ఇద్దరూ 'నీవాళ్లూ నా వాళ్లూ' అనుకోకుండా 'మనవాళ్లు' అనుకుంటూ సఖ్యంగా ఉంటే ఈ కథ మరోలా ఉండేది కాదా?

******